# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th HAPPY ANNIVERSARY

సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 | సంచిక : 314 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | సోమవారం 22 జూలై 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## పదిహేను పక్కన ఇన్ని సున్నాలా...

### రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఫైర్



- మూసీ ప్రాజెక్టు కోసం అంచనాలు మూడింతలు పెంచేశారన్న కేటీఆర్
- మూటలు పంచుకునే పని షురూ చేస్తే సహించేది లేదని హెచ్చరిక
- కుంభకోణాల కాంగ్రెస్ కు ప్రజలే కర్రుకాల్చి వాత పెడతారని స్పష్టీకరణ

వివరాలు 2లో..

**హైదరాబాద్ పెన్ పవర్:**మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి విమర్శనాస్త్రాలు సంధించారు. మూసీ నదిని అందంగా ముస్తాబు

# వైభవంగా లష్కర్ బోనాలు

## ఉజ్జయిని మహంకాళి ఆలయానికి భక్తుల క్యూ





- బోనాలతో భారీగా తరలివచ్చిన మహిళలు
- వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ
- తెల్లవారుజామున మంత్రి పొన్నం తొలిపూజ
- నేడు రంగం, ఘటాల ఊరేగింపు
- వెల్లివిరుస్తోన్న ఆధ్యాత్మిక శోభ

**హైదరాబాద్ పెన్ పవర్:** సికింద్రాబాద్‌లో ఉజ్జయిని మహంకాళి బోనాల పండగ ఘనంగా జరుగుతోంది. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అమ్మవారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు.

వివరాలు 2లో..


## వాతావరణ శాఖ హెచ్చరిక.. తెలంగాణలో మరో మూడు రోజుల పాటు వర్షాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో మరో మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు మెరుపులతోపాటు గంటకు 30కి.మీ నుంచి 40కి.మీ వేగంతో ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. చిలికా సరస్సు వద్ద ఏర్పడిన వాయుగుండం రాత్రి బలహీన

వివరాలు 2లో..

## కొండచరియలు విరిగిపడడంతో కేదార్ నాథ్ యాత్రీకులు ముగ్గురు మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:** కేదార్ నాథ్ యాత్రలో ఆది వారం అపశృతి చోటుచేసుకుంది. భారీ వర్షాలకు ఉత్తరాఖండ్ లో పలుచోట్ల కొండచరియలు విరిగి పడుతున్నాయి. ఆదివారం యాత్ర మార్గంలో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ముగ్గురు యాత్రీకులు అక్కడికక్కడే చనిపోయారు. మరో ఎనిమిది మంది యాత్రీకులు

వివరాలు 2లో..

## గోదావరి ఉగ్రరూపం.. భద్రాచలం దగ్గర మొదటి ప్రమాద హెచ్చరిక

**హైదరాబాద్ పెన్ పవర్::**భద్రాచలం దగ్గర గోదా వరి ఉగ్రరూపం దాల్చింది. తెలంగాణతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలోకి వరద నీరు చేరటంతో ప్రవాహం పెరుగుతోంది. నీటి మట్టం 43 అడుగులకు చేడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు అధికారులు. లోతట్టు ప్రాంతాల

వివరాలు 2లో..



## చెర్వుగట్టు ఆలయంలో రూ. 2కోట్లతో 200 కాటేజీలు



**హైదరాబాద్ పెన్ పవర్:**సకాలంలో వర్షాలు కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆకాంక్షించారు. నార్కట్ పల్లి మండలం గోపలాయిపల్లి వేణుగో పాల స్వామి ఆలయంలో మంత్రి కోమటిరెడ్డి సుదర్శన యాగంలో పాల్గొన్నారు. రైతులు, రాష్ట్రప్రజలు సంతోషంగా ఉండాలని వేణుగోపాల స్వామిని కోరుకున్నామని చెప్పారు. గురుపౌర్ణమి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. నల్లగొండ

వివరాలు 2లో..

## కేరళలో నిఫా వైరస్ కలకలం... రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం

- కేరళలో నిఫా వైరస్ కలకలం
- వైరస్ సోకినట్టు నిర్ధారణ అయిన గంటలోనే ఒక బాలుడు మృతి
- కేరళకు ప్రత్యేక వైద్యబృందాన్ని పంపిన కేంద్రం
- ప్రభావిత ప్రాంతాల్లో క్వారంటైన్ ఏర్పాట్లు చేయాలంటూ కేంద్రం ఆదేశాలు




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రమాదకరమైన నిఫా వైరస్ భారత్ లో తీవ్ర కలకలం రేపుతోంది. ఇప్పటికే కేరళలో ఓ బాలుడు నిఫా వైరస్ సోకి మృత్యువాత పడ్డాడు. వైరస్ సోకినట్టు నిర్ధారణ అయిన గంటలోనే బాలుడు మృతి చెందడంతో ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇది ప్రాణాంతకమైన వైరస్ కావడంతో కేంద్రం అప్రమత్తమైంది. నిఫా వైరస్ వ్యాప్తి పట్ల జాగ్రత్తగా ఉండాలని రాష్ట్రాలకు స్పష్టం చేసింది. నిఫా వైరస్ పాజిటివ్ కేసులు ఉన్న చోట క్వారంటైన్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది.

వివరాలు 2లో..

## ముగిసిన ఆల్ పార్టీ మీటింగ్.. పార్లమెంట్ సమావేశాలకు అఖిలపక్షాల సూచనలు



**హైదరాబాద్ పెన్ పవర్:** పార్లమెంట్ వర్షాకాల బడ్జెట్ సమావేశాలు జూలై 22 నుంచి ప్రారంభమవుతాయి. ఈ క్రమంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు పార్లమెంట్ హౌస్ అనెక్స్‌లోని మెయిన్ కమిటీ రూమ్‌లో ఆదివారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఉభయ సభలకు చెందిన ఫ్లోర్ లీడర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ నీట్ పేపర్ లీక్ అంశం ప్రస్తావించారు. విపక్షాలకు లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవి కాంగ్రెస్ పార్టీకి ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.


వివరాలు 2లో..

## బాబూ పులివెందుల ఎమ్మెల్యే... గతంలో ఏం చేశావో గుర్తుచేసుకోవయ్యా!

- జగన్ కు పాత బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఇచ్చారంటున్న వైసీపీ
- గతంలో చంద్రబాబుకు ఇచ్చిన కారును ఇప్పుడు జగన్ కు ఇచ్చామన్న అనిత
- జగన్ పులివెందుల ఎమ్మెల్యే మాత్రమేనని వెల్లడి
- నీలోని మహానటుడు జనాలకు కనిపించడనే వేరే కారు ఎక్కావంటూ ఫైర్

**హైదరాబాద్ పెన్ పవర్:**జగన్ కు పాత బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఇచ్చారని, చంద్రబాబు పదేళ్ల పాటు వాడిన వాహనాన్ని కనీసం మరమ్మతులు కూడా చేయించకుండా జగన్ కు కేటాయించారని వైసీపీ చేసిన ఆరోపణలపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. బాబూ పులివెందుల ఎమ్మెల్యే... నువ్వు ఇంతకుముందు ఓసారి ఏం చేశావో గుర్తుకు తెచ్చుకోవయ్యా... అంటూ ధ్వజమెత్తారు. గతంలో చంద్రబాబుకు ఏ బుల్లెట్ ప్రూఫ్ కారు ఇచ్చారో, ఇప్పుడదే కారును జగన్ కు ఇచ్చామని అనిత స్పష్టం చేశారు. చంద్రబాబుకు పాత వాహనం

వివరాలు 2లో..



## అధ్యక్ష ఎన్నికల్లో నేను గెలవాలని కిమ్ జాంగ్ ఉన్ కోరుకుంటున్నాడు

- మరోసారి తనను అధ్యక్షుడిగా చూడాలనుకుంటున్నాడేమో అన్న రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి
- నన్ను అతడు మిస్ అవుతుండడమే కారణం అనుకుంటున్నానని వ్యాఖ్య
- ఇటీవల జరిగిన రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్‌లో ఆసక్తికరమైన వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్ష ఎన్నికలు–2024లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికైన మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. అధ్యక్ష ఎన్నికల్లో తాను గెలవాలని ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ కోరుకుంటున్నారని అన్నారు. “ నన్ను మరోసారి అధ్యక్షుడిగా చూడాలని అతడు (కిమ్) కోరుకుంటున్నాడు. కారణం ఏంటంటే.. అతడు

వివరాలు 2లో..

# సంపాదకీయం

## గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా చూపించరా?

## నాటి చంద్రబాబు పాలనలా లేదా?

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శాంతిభద్రతలకు మాత్రం ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఆయన పద్నాలుగేళ్ల పాటు ముఖ్యమంత్రిగా చేసినప్పుడు ఎప్పుడూ ఇలా లా అండ్ ఆర్డర్ అదుపు తప్పలేదు. ఎంపీలను, ఎమ్మెల్యేలను తమ నియోజకవర్గాలకు వెళ్లకుండా అడ్డుకోవడం, ప్రత్యర్థి పార్టీల కార్యకర్తలను హత్యలు జరగడం వంటి ఘటనలు గతంలో ఎప్పుడూ చూడలేదు. ఎందుకంటే చంద్రబాబు సంక్షేమ పథకాల విషయాల్లో ఎలా ఉన్నప్పటికీ లా అండ్ ఆర్డర్ విషయంలో ఆయన స్ట్రిక్ట్ గా ఉంటారని గత పాలనను చూసిన వారికి ఎవరికైనా ఇలాగే తెలుస్తుంది. ఎందుకంటే ఒక అత్యాచారం జరిగినా, హత్యజరిగినా వెంటనే ఆయన నేరుగా స్పందించేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హైదరాబాద్ లో మతపరమైన ఘర్షణలు జరగకుండా చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు ఎవరూ మరువలేరు. ఒకరకంగా హైదరాబాద్ లో కర్ఫ్యూ లేని నగరంగా మార్చడంలో ఆయన చేసిన కృషిని కూడా ఎవరూ కాదనలేరు. ఇక రాష్ట్ర విభజన జరిగిన తర్వాత విజయవాడ, విశాఖపట్నం, రాయలసీమ వంటి ప్రాంతాల్లో రౌడీషీటర్లను ఏరిపారేశారు. సీమలో ఫ్యాక్షన్ ను రూపమాపడానికి ప్రత్యర్థి కుటుంబాలను కూడా చంద్రబాబు ఏకం చేశారు. ఇలా చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే గుండెల మీద చేయి వేసుకుని హాయిగా నిద్రపోవచ్చని నమ్మేవారు అనేక మంది ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు. ఎన్నికల ప్రచారంలోనూ రౌడీషీటర్లను తాను అధికారంలోకి వచ్చిన వెంటనే తరిమేస్తానని చెప్పారు. మహిళలపై అత్యాచారం చ్చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు కూడా. అయితే గత ప్రభుత్వంలో టీడీపీ నేతలపై అప్పటి వైసీపీ కార్యకర్తలు దాడికి దిగారు. పల్నాడు, రాయలసీమ జిల్లాల్లో వైసీపీ హయాంలో బయటకు రావడానికే టీడీపీ నేతలు భయపడే పరిస్థితి ఉండేది. గత ప్రభుత్వంలో లా అండ్ ఆర్డర్ అదుపు తప్పిందని చంద్రబాబు పదే పదే విమర్శించేవారు. గవర్నర్ కు లెక్కకు మించిన సార్లు ఫిర్యాదు చేశారు. కానీ ఈసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం చంద్రబాబు గత పాలనలా లేదన్న విమర్శలు మాత్రం వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో టీడీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు జరిగి ఉండవచ్చు. అయితే దానికి ప్రతీకారంగా తిరిగి దాడులకు దిగితే ఆ ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి పెద్ద తేడా ఏముంటుందన్న ప్రశ్నలు నేరుగానే సోషల్ మీడియాలో వేస్తుండటం కనిపిస్తుంది. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించవద్దంటూ ప్రతిపక్షంలో పదే పదే హెచ్చరించిన చంద్రబాబు సర్కార్ ఇప్పుడు అదే పనిచేస్తుండటాన్ని పలువురు మేధావులు కూడా తప్పుపడుతున్నారు. ప్రజలు అంతా గమనిస్తుంటారని, వారికి సరైన సమయం వచ్చినప్పుడు తమ నిర్ణయాన్ని ప్రకటిస్తారని, అందుకే చంద్రబాబు రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించడం పార్టీకే మంచిదన్న సూచనలు వెలువడుతున్నాయి.

## హైదరాబాద్ అపార్ట్‌మెంట్‌లో ఘోరం.. బాత్‌రూంలో ముగ్గురి మృతదేహాలు



హైదరాబాద్ : అపార్ట్ మెంట్ లో ఘోరం జరిగింది. ఇంట్లో కరెంట్ షాక్ తో ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. సనత్ నగర్ జెక్ కాలనీలోని ఆకృతి రెసిడెన్సి అపార్ట్ మెంట్ రెండవ అంతస్తులోని 204 ఫ్లాట్ లో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. విద్యుదాఘాతంతో ముగ్గురు కుటుంబ సభ్యుల మృతి ఇంట్లోని బాత్రూంలో పడి ఉన్నారు. మృతదేహాలను సాయంత్రం కాలనీవాసులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వైభవంగా లష్కర్ బోనాలు

- మొదటి పేజీ తరువాయి

మహంకాళికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పండితులు ముఖ్యమంత్రికి వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మహాకాళి అమ్మవారిని దర్శించుకుని.. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు జరుపుకునే పవిత్రమైన రోజున అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణలో వందల ఏళ్లుగా బోనాల ఉత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు. ఎవరు ఏ రంగంలో ఉన్నా.. ఎంత స్థాయిలో ఉన్నా దేవతలను పూజించే విధానాలు ఒకేలా ఉంటాయన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందామని మంత్రి తెలిపారు. భక్తుల సౌకర్యాల్లో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని అధికారులను సీతక్క ఆదేశించారు. తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్.. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. పట్టువస్త్రాలతోపాటు అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. బోనాల జాతర సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ ఎంపీ లక్ష్మణ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఇక భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుండటంతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొన్నది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

# గోదావరి ఉగ్రరూపం.. భద్రాచలం దగ్గర మొదటి ప్రమాద హెచ్చరిక

- మొదటి పేజీ తరువాయి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు అధికారులు. భద్రాచలం స్నానఘట్టాల దగ్గర వరద నీరు పెరుగుతుండడంతో అప్రమత్తం చేశారు. కరకట్ట స్లూయిజ్ ల దగ్గర పరిస్థితిని పరిశీలించి పట్టణ బ్యాక్ వాటర్ తో పాటు గోదావరి వరద నీరు స్లూయిజ్ ల ద్వారా లీకేజి కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి అని ఆదేశించారు. కొత్త కాలనీ లోకి సుభాష్ నగర్ కాలనీ లలోకి గోదావరి వరద నీరు ముందుగా వచ్చే అవకాశం ఉండడంతో .. ఆయా ప్రాంతాల ప్రజలను ముందుగా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసారు. పట్టణంలో 10 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు మరింత వరద పెరిగితే గోదావరి 48 అడుగులకు చేరితే రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. అపుడు భద్రాచలం నుండి దుమ్ముగూడెం చర్ల మండలాలకు.. ఇటు ఆంధ్రా కూనవరం చింతూరు వి.ఆర్.పురం మండలాలకు రాకపోకలు నిలిచిపోతాయి. పునరావాస కేంద్రాలలో తలదాచుకునే ప్రజలకు అన్ని వసతులు ఏర్పాటు చేశారు. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు జలాశయానికి ఎగువన ఛత్తీస్ ఘడ్ నుండి వస్తున్న భారీ వరదతో ఈరోజు మొత్తంగా 5 లక్షల క్యూసెక్కుల వరదనీరు దిగువకు విడుదల చేశారు అధికారులు

# పదిహేను పక్కన ఇన్ని సున్నాలా...

- మొదటి పేజీ తరువాయి

చేసేందుకు మొన్న రూ.50 వేల కోట్లు అవుతుందని అన్నారు... నిన్న రూ.70 వేల కోట్లు ఖర్చు చేస్తామంటున్నారు... నేడు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తామంటున్నారని వివరించారు. తెలంగాణ రైతుల తలరాతను మార్చిన కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.80 వేల కోట్లు అయితేనే కాంగ్రెస్ పార్టీ గల్లీ నుంచి ఢిల్లీ దాకా గగ్గోలు పెట్టిందని విమర్శించారు. మరి, సుందరీకరణకే రూ.1.50 లక్షల కోట్లా...! పదిహేను పక్కన ఇన్ని సున్నాలా... 15,000,000,000,000... అంటూ కేటీఆర్ వ్యంగ్యం ప్రదర్శించారు. ఇంతకీ మూసీ ప్రాజెక్టుతో మురిసే రైతులెందరు? నిల్వ ఉంచే టీఎంసీలు ఎన్ని? సాగులోకి వచ్చే ఎకరాలు ఎన్ని? పెరిగే పంటల దిగుబడి ఎంత? తీర్చే పారిశ్రామిక అవసరాలెంత? కొత్తగా నిర్మించే భారీ రిజర్వాయర్లు ఎన్ని? అని కేటీఆర్ ప్రశ్నించారు. పుట్టినగడ్డపై మమకారం లేని ముఖ్యమంత్రి గారికి... పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కంటే కూడా మూసీ ప్రాజెక్టుపైనే ఎందుకింత మక్కువ? అంటూ కేటీఆర్ తన ట్వీట్ లో పేర్కొన్నారు. చివరి దశలో ఉన్న ప్రాజెక్టును పక్కనబెట్టి... మూసీ చుట్టూ ఎందుకింత మంత్రాంగం...? అంటూ సందేహం వ్యక్తం చేశారు. లండన్ లోని థేమ్స్ నదిలాగా మారుస్తామనే వ్యూహం వెనుక థీమ్ ఏంటి? గేమ్ ప్లాన్ ఏంటి? అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి గారూ... మూడింతలు పెంచిన మూసీ అంచనా వ్యయం కాంగ్రెస్ ధన దాహానికి సజీవ సాక్ష్యం... మూసీ ప్రాజెక్టును చేపట్టాల్సిందే, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాల్సిందే... కానీ... మాటల దశలోనే ఉన్న ప్రాజెక్టులో మూటలు పంచుకునే పని షురూ చేస్తే మాత్రం సహించేది లేదు అంటూ కేటీఆర్ హెచ్చరించారు. తట్టెడు మట్టి కూడా తీయకముందే కోట్లు తన్నుకుపోయే కుట్రకు తెరదీస్తే భరించబోమని స్పష్టం చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ పేరిట బ్యాక్ డోర్ లో జరుగుతున్న భాగోతాన్ని తెలంగాణ సమాజం అనుక్షణం గమనిస్తోంది... కుంభకోణాల కాంగ్రెస్ కు కర్రుకాల్చి వాతపెడుతుంది అంటూ కేటీఆర్ పేర్కొన్నారు.

# చెర్వుగట్టు ఆలయంలో రూ. 2కోట్లతో 200 కాటేజీలు

- మొదటి పేజీ తరువాయి

జిల్లాలో పెండింగ్ లో ఉన్న ఎస్ ఎల్ బీసీ ప్రాజెక్టుకు గ్రీన్ ఛానల్ ద్వారా రూ. 2వేల కోట్లు మంజూరు చేశారన్నారు. బ్రాహ్మణ వెల్లాంల ఉదయ సముద్రం ప్రాజెక్టునుంచి వచ్చే మార్చి వరకు పూర్తి చేసి ఆ ప్రాంతానికి కృష్ణా జలాలు అందిస్తామన్నారు. రైతుల రుణమాఫీ కోసం ఒకే రోజు 6వేల కోట్లు రైతులు ఖాతాలో వేసి వారి కళ్లలో ఆనందం చూశామన్నారు. ఆగస్ట్ వరకు రూ. 2లక్షల రుణమాఫీ అందరి రైతులకు చేస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అన్నారు.

జిల్లాలో శైవ పుణ్యక్షేత్రం చెర్వుగట్టు రామలింగేశ్వర స్వామి ఆలయ పరిధిలో

రూ2వేల కోట్లతో 200 కాటేజీలు నిర్మిస్తామన్నారు. జాతీయ రహదారి65 విస్తరణ కోసం కేంద్ర మంత్రి నితిన్ గట్కారి ని కలిసి విజయవాడ-హైదరాబాద్ ఆరు లైన్ గా విస్తరణకు పనులకు ఆమోదం పై చర్చిస్తానన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.

# బాబూ పులివెందుల ఎమ్మెల్యే... గతంలో ఏం చేశావో గుర్తుచేసుకోవయ్యా!

- మొదటి పేజీ తరువాయి

ఇచ్చింది నువ్వు... ఇప్పుడదే వాహనాన్ని నీకు ఇస్తే ఎందుకు రాద్ధాంతం చేస్తున్నావు అంటూ మండిపడ్డారు. "సాక్షి పేపర్లో ఇవాళ... జగన్ కు ఇచ్చిన వెహికిల్ గురించి రాశారు. అదొక పాంప్లెట్ పేపరు. జగన్ మోహన్ రెడ్డి అనే వ్యక్తి ఇవాళ కేవలం పులివెందుల ఎమ్మెల్యే. కేవలం ఒక మాజీ ముఖ్యమంత్రిగా ఉన్నందున జడ్ ప్లస్ సెక్యూరిటీ ఇచ్చారు. టాటా సఫారీ వాహనం ఇచ్చారని తెగ బాధపడిపోయావు. నీకున్న ఆస్తికి టాటా సఫారీ అంటే లెక్కలేదనుకో... అది వేరే విషయం. కానీ 2019 లో నువ్వు సీఎం అయ్యాక, మాజీ సీఎంగా ఉన్న చంద్రబాబుకు నువ్వు ఇచ్చింది టాటా సఫారీ వాహనమే. ఇవాళ మేం నీకు ఇచ్చింది కూడా టాటా సఫారీయే. ప్రభుత్వం మీద బురద చల్లాలన్న ఉద్దేశంతోనే, వెహికిల్ కూడా సరైనది ఇవ్వలేదని నువ్వు సృష్టించిన డ్రామా ఇది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ హైదరాబాద్ వెళ్లినా, ఢిల్లీ వెళ్లినా టాటా సఫారీ వాహనమే ఉపయోగిస్తారు. మాజీ సీఎంగా ఉన్న నీకు కూడా టాటా సఫారీ వాహనమే ఇచ్చారు కదా... నీకు ఎక్కడ తక్కువ చేశారు? ఆ కారు నీకు నచ్చలేదంతే! ఎందుకు నచ్చలేదంటే... బయటున్న ప్రజలు నీకు కనిపించడంలేదు, నీ హావభావాలు బయటున్న వారికి కనిపించడంలేదు, నీలో ఉన్న మహానటుడు కనిపించడంలేదని బాధపడిపోయి, టాటా సఫారీ కారు దిగి వేరే కారు ఎక్కావు. నువ్వు వేరే కారు ఎక్కినా కూడా ఆ టాటా సఫారీ కారు నీ వెనుకే కాన్వాయ్ లో వచ్చింది. ఎక్కడా ప్రోటోకాల్ ఉల్లంఘించలేదు, ఎక్కడా నీకు సెక్యూరిటీ తగ్గించలేదు, నిన్నెవరూ ఇబ్బంది పెట్టలేదు, నీ ఇంటి మీద ఎవరూ దాడికి రాలేదు, నువ్వెక్కడికైనా వెళతానంటే పోలీసులతో తాళ్లు కట్టలేదు. మరి ఎక్కడ అటవిక పాలన జరిగిందో నువ్వు, నేను చర్చించుకోవాలి" అంటూ అనిత తీవ్రస్థాయిలో స్పందించారు.

## వాతావరణ శాఖ హెచ్చరిక.. తెలంగాణలో మరో మూడు రోజుల పాటు వర్షాలు

- మొదటి పేజీ తరువాయి

పడి అల్పపీడనంగా మారిందని.. ఇది వాయువ్య దిశలో కదిలి ఆదివారం ఉదయం 8:30 గంటలకు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాన్ని తాకిందని తెలిపింది. రానున్న 12 గంటల్లో ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో అల్పపీడనంగా బలహీనపడే అవకాశముందని వెల్లడించింది.

## కేరళలో నిఫా వైరస్ కలకలం... రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం

- మొదటి పేజీ తరువాయి

నిఫా వైరస్ తొలిసారిగా 1999లో వెలుగులోకి వచ్చింది. అయితే దీనికి వ్యాక్సిన్ లేదు. ఇది జంతువుల ద్వారా మనుషులకు సోకుతుంది. 2018లో కేరళలో ఈ వైరస్ బారినపడి 27 మంది మృతి చెందారు. తాజాగా, కేరళలో మరోమారు నిఫా కలకలం రేగడంతో, కేంద్ర ప్రభుత్వం ఓ ప్రత్యేక వైద్య బృందాన్ని కేరళకు పంపింది.

## అధ్యక్ష ఎన్నికల్లో నేను గెలవాలని కిమ్ జాంగ్ ఉన్ కోరుకుంటున్నాడు

- మొదటి పేజీ తరువాయి

నన్ను మిస్ అవుతుండడమేనని అనుకుంటున్నాను" అని ట్రంప్ అన్నారు. ఇటీవల మిల్వాకీలో జరిగిన రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తాను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగాలు చేపట్టకుండా ఆపివేసినట్లు ట్రంప్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. అయితే ఆ దేశం మళ్లీ క్షిపణి ప్రయోగాలు చేస్తోందని పేర్కొన్నారు. కాగా అధ్యక్షుడిగా సమయంలో కిమ్ జాంగ్ ఉన్‌ను 'లిటిల్ రాకెట్ మ్యాన్'గా ట్రంప్ సంబోధిస్తుండేవారు. ఇరువురూ పలుమారు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసుకున్నప్పటికీ చివరికి ఘర్షణలు పక్కనపెట్టి దౌత్య మార్గాన్ని అనుసరించారు. ఇద్దరూ పరస్పర చర్చలు జరిపిన విషయం తెలిసిందే.

## ముగిసిన ఆల్ పార్టీ మీటింగ్.. పార్లమెంట్ సమావేశాలకు అఖిలపక్షాల సూచనలు

- మొదటి పేజీ తరువాయి

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కన్వర్ యాత్రా మార్గంలో దుకాణాలకు నేమ్‌ప్లేట్లు తప్పనిసరి చేసిన అంశాన్ని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్ గోపాల్ ఖండించారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత, పేపర్ లీక్‌లు, చైనాతో భద్రతాంశాలు, పార్లమెంటులో విగ్రహాల తొలగింపు, రైతులు, కార్మికులు, మణిపూర్, రైలు ప్రమాదాలు, పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాలని అఖిలక్షాల మీటింగ్ లో కోరారు. కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ అఖిలపక్ష భేటీ ఆదివారం సాయంత్రం ముగిసింది.

## కొండచరియలు విరిగిపడడంతో కేదార్ నాథ్ యాత్రీకులు ముగ్గురు మృతి

- మొదటి పేజీ తరువాయి

గాయపడ్డారు. గౌరీకుండ్, ఛిర్ బాసా మధ్యలో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు వెల్లడించారు. గాయపడిన వారిని ఆసుపత్రి కి తరలించినట్లు తెలిపారు. కాగా, చనిపోయిన యాత్రీకులలో ఇద్దరు మహారాష్ట్రకు చెందిన వారని, మరొకరి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ విచారం వ్యక్తంచేశారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# ప్రభుత్వ ఆస్పత్రిలో యువతి మృతి... రాంగ్ ఇంజెక్షన్ ఇచ్చారంటున్న కుటుంబ సభ్యులు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక ఇంజెక్షన్ కు బదులు మరో ఇంజెక్షన్ ఇవ్వడంతో 28 ఏళ్ల యువతి చనిపోయిందని ఆమె కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కేరళలో ఈ షాకింగ్ ఘటన వెలుగుచూసింది. ఐదు రోజుల క్రితం డాక్టర్ రాంగ్ ఇంజెక్షన్ ఇచ్చాడని, ఐదు రోజులు అపస్మారక స్థితిలో ఉన్న తర్వాత ఆదివారం ఉదయం చనిపోయిందని చెబుతున్నారు. మృతురాలి పేరు కృష్ణ తంకప్పన్ అని, మలయిన్‌కీజ్‌కు సమీపంలోని నెయ్యట్టింకర జనరల్ హాస్పిటల్‌లో ఆమె తుది శ్వాస విడిచిందని పేర్కొన్నారు. మృతురాలు కృష్ణ తంకప్పన్ గత 5 రోజులుగా అపస్మారక స్థితిలో ఉండి చనిపోవడానికి ఆస్పత్రి నిర్లక్ష్యమే కారణమని, హాస్పిటల్‌లో పనిచేస్తున్న విను అనే వైద్యుడు రాంగ్ ఇంజెక్షన్ ఇవ్వడమే కారణమని ఆరోపిస్తున్నారు. ఈ మేరకు మృతురాలి భర్త శరత్ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాడు. దీంతో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 125 కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇతరుల ప్రాణాలకు లేదా వ్యక్తిగత రక్షణకు హాని కలిగించిన వారిపై ఈ కేసు పెడతారు. కాగా ఎఫ్ఐఆర్ ప్రకారం.. అప్పటికే కొన్ని అలర్జీ సమస్యలు ఎదుర్కొంటున్న మహిళ కిడ్నీల్లో రాళ్ల సమస్యతో డాక్టర్ వినుని సంప్రదించి హాస్పిటల్‌లో చేరింది. అయితే ఎలాంటి అలర్జీ పరీక్ష నిర్వహించకుండానే రోగికి ఇంజక్షన్ ఇచ్చారని, యువతి ప్రాణాలు కోల్పోవడానికి కారణం ఇదేనని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే ఈ ఆరోపణలను కేరళ ప్రభుత్వ వైద్యాధికారుల సంఘం ఖండించింది. ఉదర సంబంధిత సమస్యలతో బాధపడే రోగులకు ఇచ్చే సాధారణ ఇంజక్షన్ అనాఫిలాక్సిస్‌ను వైద్యుడు ఇచ్చాడని అసోసియేషన్ పేర్కొంది. తీవ్రమైన అలర్జీ కారణంగా రియాక్షన్ వచ్చి మహిళ చనిపోయి ఉండొచ్చని, ఇది వైద్యుడి నిర్లక్ష్యమని చెప్పలేమని అసోసియేషన్ పేర్కొంది.

# ఢిల్లీలో ముగిసిన కేంద్రం అఖిలపక్ష భేటీ



**హైదరాబాద్ పెన్ పవర్:** నేటి నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో, నేడు ఢిల్లీలో కేంద్ర అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ అఖిలపక్ష భేటీ ముగిసింది. పార్లమెంటు అనెక్స్ భవనంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశం సుదీర్ఘ సమయం పాటు సాగింది. రేపటి నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఉన్నందున సహకారం అందించాలని కేంద్ర ప్రభుత్వం విపక్షాలను కోరింది. బడ్జెట్ తో పాటు, పార్లమెంటులో ప్రవేశపెట్టే బిల్లుల జాబితాను కూడా కేంద్రం విపక్షాలకు అందించింది.కాగా, రేపు ప్రారంభం కానున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో... విపక్షాలు నీట్ పరీక్ష వివాదం, మణిపూర్ హింస, ధరల పెరుగుదల, నిరుద్యోగం తదితర అంశాలపై చర్చకు పట్టుబట్టే అవకాశం ఉంది.

# గవర్నర్ ను కలిసి రాష్ట్రంలో పరిస్థితులు వివరించనున్న జగన్

**ఏపీలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందంటున్న వైసీపీ**

**సాయంత్రం 5 గంటలకు రాజ్ భవన్ కు వెళ్లనున్న జగన్**

**టీడీపీ పాలనపై గవర్నర్ కు వివరించనున్న వైసీపీ అధినేత**



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ నేడు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ను కలవనున్నారు. ఈ సాయంత్రం 5 గంటలకు విజయవాడలోని రాజ్ భవన్ కు వెళ్లనున్న జగన్ గవర్నర్ తో భేటీ అవుతారు. రాష్ట్రంలో పరిస్థితులను గవర్నర్ కు వివరించనున్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అరాచకాలు జరుగుతున్నాయని, హత్యలు, దాడి ఘటనలు, విధ్వంసాలు చోటుచేసుకుంటున్నాయని గవర్నర్ కు తెలుపనున్నారు. వినుకొండ హత్య, పుంగనూరులో ఎంపీ మిథున్ రెడ్డిపై రాళ్ల దాడి, ఆయన వాహనాలను ధ్వంసం చేయడం, మాజీ ఎంపీ రెడ్డప్ప కారును దహనం చేయడం వంటి ఘటనలపై గవర్నర్ కు సాక్ష్యాలను, వీడియోలను అందజేయనున్నారని వైసీపీ ఓ ప్రకటనలో తెలిపింది.

# బంగ్లాదేశ్ లో రిజర్వేషన్ల చిచ్చు... అత్యంత కీలక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు

- **స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్**
- **భగ్గుమన్న విద్యార్థులు, నిరుద్యోగులు**
- **హింసాత్మకంగా మారిన నిరసనలు**
- **ఇప్పటిదాకా 114 మంది మృతి**
- **రిజర్వేషన్ల కోటాను 5 శాతానికి తగ్గించాలంటూ సుప్రీంకోర్టు తీర్పు**



**హైదరాబాద్ పెన్ పవర్:** బంగ్లాదేశ్ రిజర్వేషన్ల చిచ్చు తీవ్రస్థాయిలో రగులుతున్న వేళ ఆ దేశ సుప్రీంకోర్టు అత్యంత కీలక తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే... దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్లు ఇస్తూ బంగ్లాదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వివాదాస్పదంగా మారింది. దీన్ని రద్దు చేయాలన్న డిమాండ్ తో విద్యార్థులు రోడ్లెక్కారు. బంగ్లాదేశ్ లో రిజర్వేషన్ల హింస ప్రజ్వరిల్లగా, 114 మంది మృతి చెందారు. ప్రస్తుతం అక్కడ షూట్ ఎట్ సైట్ ఆర్డర్స్ అమల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు విద్యార్థులకు, నిరుద్యోగులకు ఊరటనిచ్చింది. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోటాను తగ్గించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ కోటాను 30 నుంచి 5 శాతానికి తగ్గించాలని బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. దేశంలో 93 శాతం ఉద్యోగ నియామకాలు ప్రతిభ ఆధారంగా చేపట్టాలని, మిగిలిన 2 శాతం దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లు, మైనారిటీలకు కేటాయించాలని తీర్పు వెలువరించింది. ఈ ఏడాది ఆరంభంలో బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలు జరగ్గా... షేక్ హసీనా ప్రభుత్వం నాలుగోసారి అధికారం చేపట్టింది. అయితే, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులకు భారీగా రిజర్వేషన్లు ప్రకటించడం తీవ్ర వ్యతిరేకతకు దారితీసింది. ఢాకా యూనివర్సిటీలో మొదలైన ఘర్షణలు, కొద్ది వ్యవధిలోనే దేశమంతా పాకిపోయాయి. చివరికి సైన్యం కూడా రంగంలోకి దిగాల్సి వచ్చింది. దేశవ్యాప్తంగా కర్ఫ్యూ విధించారు.

# 'ఉమెన్ చాందీ పబ్లిక్ సర్వెంట్ అవార్డ్'కి ఎంపికైన రాహుల్ గాంధీ



**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి, దివంగత ఉమెన్ చాందీ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన తొలి 'ఉమెన్ చాందీ పబ్లిక్ సర్వెంట్ అవార్డు'కు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఎంపికయ్యారు. ఉమెన్ చాందీ ప్రథమ వర్థంతి పూర్తయిన మూడు రోజుల అనంతరం 'ఉమెన్ చాందీ ఫౌండేషన్' ఈ అవార్డును ప్రకటించింది. ఈ అవార్డు కింద రూ.1 లక్ష నగదు, ప్రఖ్యాత కళాకారుడు, చిత్రనిర్మాత పుష్పరాజ్ రూపొందించిన శిల్పాన్ని అందజేయనున్నారు. కాగా రాహుల్ గాంధీ చాలా ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. భారత్ జోడో యాత్ర నిర్వహించి దేశవ్యాప్తంగా ప్రజల సమస్యలను విన్నారు. వాటికి పరిష్కారాల కోసం ప్రయత్నించారని, అందుకే ఎంపీ శశి థరూర్ అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల జ్యూరీ రాహుల్ గాంధీకి ఈ అవార్డును ఎంపిక చేసిందని ఒక ప్రకటనలో 'ఉమెన్ చాందీ ఫౌండేషన్' పేర్కొంది.

# మాజీ సీఎం జగన్ కు మంత్రి అనిత సూటి ప్రశ్న

**36 హత్యలు ఎక్కడ జరిగాయో వివరాలు చెప్పాలని డిమాండ్**

**నాలుగు హత్యలు జరిగితే 36 హత్యలని ప్రచారం చేస్తున్నారని ఫైర్**

**ఇష్టారీతిన ఆరోపణలు చేస్తే చర్యలు తప్పవన్న హోంమంత్రి**



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగుదేశంలో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్న మాజీ సీఎం జగన్ పై హోంమంత్రి అనిత సీరియస్ అయ్యారు. అబద్ధపు ప్రచారాలకు తెరలేపినందుకు మీపై చర్యలు ఎందుకు తీసుకోకూడదోనంటూ జగన్ ను మీడియా ముఖంగా ప్రశ్నించారు. ఈమేరకు మంగళగిరిలో హోంమంత్రి అనిత ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై మాజీ సీఎం జగన్ చేసిన ఆరోపణలపై అనిత మండిపడ్డారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పటి వరకు రాష్ట్రంలో నాలుగు రాజకీయ హత్యలు జరిగాయని వివరించారు. చనిపోయిన వారిలో ముగ్గురు టీడీపీ కార్యకర్తలు, నాయకులేనని గుర్తుచేశారు. జరిగిన విషయం ఇది.. కానీ జగన్ మాత్రం అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అనిత ఆరోపించారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 36 హత్యలు జరిగాయని జగన్ చెబుతున్నారని విమర్శించారు. ఆ 36 హత్యల వివరాలు ఇస్తే పోలీసులతో సమగ్ర విచారణ జరిపిస్తామని చెప్పారు. అలాకాకుండా కేవలం ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి తప్పుడు ఆరోపణలు చేస్తే జగన్ పై చర్యలు ఎందుకు తీసుకోకూడదని ప్రశ్నించారు. ఇంకా ప్రజలు తన మాటలు నమ్ముతారని జగన్ భావించడం హాస్యాస్పదమని హోంమంత్రి అనిత కొట్టిపారేశారు.

# దగ్గరుండి మరీ ఉగ్రవాదులను భారత్ లోకి పంపిస్తున్న పాక్ ఆర్మీ

**పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి భారత్ లోకి ఉగ్రవాదుల చొరబాటు**

**భారత సైన్యం కళ్లు గప్పే మార్గాలను ఉగ్రవాదులకు వివరిస్తున్న పాక్ సైన్యం**

**ఇప్పటివరకు ఈ విధంగా 55 మంది ఉగ్రవాదులు వచ్చి ఉంటారన్న భారత సైన్యం!**



**హైదరాబాద్ పెన్ పవర్:** సరిహద్దులను కాపాడేందుకు భారత సైనికులు ప్రాణాలకు తెగించి మరీ పోరాడుతున్న వేళ.... పాకిస్థాన్ సైన్యం ఎంత దుష్ట ప్రణాళికను అమలు చేస్తోందో తాజాగా బట్టబయలైంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి కొందరు ఉగ్రవాదులను పాక్ సైనికులు దగ్గరుండి మరీ భారత్ లోకి పంపిస్తున్నారు. సరిహద్దుల్లో ఎక్కడ్నించి చొరబడితే భారత సైన్యం కంటబడకుండా తప్పించుకోవచ్చో పాక్ సైనికులు ఆ ఉగ్రవాదులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

పీవోకేలోని కోట్లీ ప్రాంతంలో కొన్ని చోట్ల పఠాన్ దుస్తుల్లో ఉన్న ఉగ్రవాదులను పాక్ సైనికులు సరిహద్దుల గుండా భారత్ లోకి పంపిస్తున్న ఫొటోలు వెలుగులోకి వచ్చాయి. పాక్ లోని వివిధ ప్రాంతాల నుంచి ఉగ్రవాదులను సరిహద్దుల వద్దకు తీసుకువస్తున్న సైన్యం... వారికి తమ బంకర్లలోనే ఆశ్రయం కల్పించి, పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు వారిని భారత్ లోకి పంపిస్తోంది. ఆ ఫొటోలలో ఆయుధాలతో ఉన్న టెర్రరిస్టులతో పాటు పాక్ సైన్యానికి చెందిన ఎస్ఎస్ జీ కమాండోలు కూడా కనిపిస్తున్నారు.

భారత సైనిక వర్గాలు కూడా పాక్ సైన్యం చేస్తున్న కుట్రను నిర్ధారించాయి. పాకిస్థానీ రేంజర్ల రక్షణలో సరిహద్దుల్లోంచి పాక్ ఉగ్రవాదులు భారత్ లో చొరబడుతున్నారని భారత్ సైన్యంలోని ఓ ఉన్నతస్థాయి వ్యక్తి వెల్లడించారు. ఈ విధంగా భారత్ లోకి చొరబడిన ఉగ్రవాదుల సంఖ్య 50 నుంచి 55 వరకు ఉండొచ్చని తెలిపారు. ఎక్కడ సరిహద్దులు దాటాలి? అక్కడ్నించి ఏ మార్గంలో వెళ్లాలి? అనే అంశాలను పాక్ సైనికులు ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్న విషయం తాజా విజువల్స్ తో వెల్లడైందని వివరించారు.

ఇటీవల కాలంలో కశ్మీర్ లో ఉగ్రదాడులు బాగా పెరిగాయి. ఇటీవల జరిగిన ఘటనల్లో అనేకమంది భారత జవాన్లు మృతి చెందడం తెలిసిందే. జమ్మూ ప్రాంతంలో నదులు ఎక్కువగా ఉంటాయి. రుతుపవనాల సీజన్ లో ఇక్కడ వాతావరణం అత్యంత ప్రతికూలంగా ఉంటుంది. భారీ వర్షాలు కురిసే ఈ సమయంలో భారత జవాన్లు విధులు నిర్వర్తించడం ఎంతో కష్టసాధ్యంగా ఉంటుంది. అందుకే ఈ సీజన్ లో సరిహద్దులు దాటేందుకు ఉగ్రవాదులు ప్రయత్నిస్తుంటారు. వారికి పాక్ సైన్యం కూడా సహకరిస్తుండడంతో సరిహద్దులు దాటడం సులువుగా మారింది.

# విశాఖలో వైసీపీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరిన కార్పొరేటర్లు

**ఏపీలో ఎన్నికల అనంతరం మొదలైన వలసలు**

**విశాఖలో టీడీపీలో చేరిన ఏడుగురు వైసీపీ కార్పొరేటర్లు**

**పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికిన ఏపీ టీడీపీ చీఫ్ పల్లా శ్రీనివాసరావు**



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో ఎన్నికల అనంతరం వలసల పర్వం మొదలైంది! విశాఖపట్నంలో ఏడుగురు కార్పొరేటర్లు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. విశాఖలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో వైసీపీ కార్పొరేటర్లు 'సైకిల్' ఎక్కారు. కార్పొరేటర్లు గోవింద్, కంపా హనూక్, అప్పారావు, నరసింహపాత్రుడు, అప్పలరత్నం, రాజారామారావు, వరలక్ష్మి టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆ ఏడుగురు కార్పొరేటర్లకు పసుపు కండువాలు కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ టీడీపీ చీఫ్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ... విశాఖ నగరాభివృద్ధే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. జీవీఎంసీ (గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్) ద్వారానే విశాఖ అభివృద్ధి జరగాల్సి ఉందని, అందుకే వైసీపీ కార్పొరేటర్లను తమ పార్టీలో చేర్చుకున్నామని వివరించారు. కార్పొరేషన్ మేయర్ గడువుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# ఐపీఎల్ లో హార్దిక్ పాండ్యా తనపై కోప్పడడం పట్ల మహ్మద్ షమీ ఆసక్తికర వ్యాఖ్యలు

మ్యాచ్ సమయంలో స్నేహితులమనే విషయం కూడా గుర్తుండదన్న షమీ

అప్పుడు ఏమన్నానో కూడా గుర్తులేదంటూ పాండ్యా ప్రమాణం చేసి చెప్పాడన్న స్టార్ పేసర్

టీవీలలో కోట్లాది మంది చూస్తుంటారు కాబట్టి భావోద్వేగాలను అదుపుచేసుకోవడం మంచిదని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** వన్డే వరల్డ్ కప్ 2023 తర్వాత చీలమండ గాయం కారణంగా క్రికెట్‌కు దూరమై... శస్త్రచికిత్స చేయించుకున్న స్టార్ పేసర్ మహ్మద్ షమీ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో పాపులర్ యూట్యూబర్ శుభంకర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో షమీ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్ సీజన్-2022లో తాను ఓ క్యాచ్ పట్టడంలో విఫలం కాగా, నాటి గుజరాత్ టైటాన్స్ కెప్టెన్‌గా ఉన్న హార్దిక్ పాండ్యా తనపై కోప్పడడం పట్ల షమీ స్పందించాడు. "నేను సాధారణంగా ఇలాంటి ఘటనల విషయంలో స్పందించను. కానీ మరీ ఇబ్బంది పెట్టే విషయాలైతే మాట్లాడతాను. పాండ్యాకు, నాకు మధ్య మంచి అనుబంధం ఉంది. ఇద్దరం స్నేహితులం. అయితే మ్యాచ్ ఆడుతున్న సమయంలో అవేమీ గుర్తురావు. ఆ విషయం ఇద్దరికీ తెలుసు. దాదాపు 10 ఏళ్లుగా ఒకరికొకరం తెలుసు. క్యాచ్ విషయంలో నేను ఏమన్నానో కూడా నాకు గుర్తులేదు... ప్రమాణం చేసి చెబుతున్నా అని పాండ్యా నాతో చెప్పాడు. అయితే కోట్లాది మంది క్రికెట్ అభిమానులు టీవీలలో మమ్మల్ని చూస్తుంటారు. కాబట్టి అలాంటి భావోద్వేగాలను అదుపు చేసుకోవాలి" అని షమీ పేర్కొన్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2022 సీజన్‌లో షమీ, పాండ్యా ఇద్దరూ గుజరాత్ టైటాన్స్‌కు ఆడగా.. ఒక మ్యాచ్‌లో తన బౌలింగ్‌లో షమీ క్యాచ్ పట్టకపోవడంతో పాండ్యా ఆగ్రహానికి గురయ్యాడు. మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌కు వికెట్ అవసరమైన కీలక దశలో థర్డ్ మ్యాన్ దిశలో ఫీల్డింగ్ చేస్తున్న షమీ క్యాచ్‌ను ఒడిసిపట్టకపోవడమే పాండ్యా కోపానికి కారణమైంది. దీంతో పాండ్యా ఒక్కసారిగా షమీపై కోపంతో అరిచాడు. సరిగ్గా ప్రయత్నించలేదనే ఉద్దేశంతో అసహనం వ్యక్తం చేశాడు.

# ధోనీ స్థానాన్ని రిషబ్ పంత్‌తో భర్తీ చేయనున్న సీఎస్‌కే?

ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి సీఎస్‌కేకు మారనున్న పంత్

వచ్చే సీజన్‌లో ధోనీ ఆడకపోవచ్చన్న వార్తలు

తన టీంకు గుడ్‌బై చెప్పనున్న లఖ్‌నవూ కెప్టెన్ కేఎల్ రాహుల్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్‌లో మహేంద్ర సింగ్ ధోనీ కొనసాగడం సందేహంగా మారింది. ఈ ఏడాదే ధోనీ రిటైర్‌మెంట్ ప్రకటించొచ్చన్న అంచనాలు వెలువడినా, సీజన్ చివర్లో ఇందుకు సంబంధించి ఎలాంటి ప్రకటనా వెలువడలేదు.

అయితే, వచ్చే సీజన్‌లో ధోనీ ఆడటం అనుమానమేనని తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా ఉన్న రిషబ్ పంత్ వచ్చే సీజన్‌కు సీఎస్‌కేకు మారనున్నట్టు సమాచారం. ధోనీ స్థానాన్ని పంత్‌తో భర్తీ చేయాలని సీఎస్‌కే చూస్తోందట. ధోనీ వచ్చే ఏడాది ఆడతాడో లేదో కానీ పంత్ మాత్రం ఢిల్లీని వీడి సీఎస్‌కేతో కలవడం ఖాయమని అంటున్నారు. మరోవైపు, లఖ్‌నవూ కెప్టెన్ కేఎల్ రాహుల్.. ఆ జట్టుకు గుడ్‌బై చెప్పి బెంగళూరులో చేరనున్నాడట. గత సీజన్లో లఖ్‌నవూ యజమాని, రాహుల్‌ను బహిరంగంగా తిడుతున్నట్టు కనిపించిన వీడియో దుమారం రేపిన విషయం తెలిసిందే.

# పాండ్యా కెప్టెన్సీ ఆశలు ఆవిరి చేయడంలో అజిత్ అగార్కర్ పాత్ర!

శ్రీలంక పర్యటనకు జట్టును ఎంపిక చేసిన సెలక్షన్ కమిటీ

కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్‌గా శుభమన్ గిల్

పాండ్యా ఫిట్‌నెస్ నిలకడలేమిపై కోచ్ గంభీర్ అసంతృప్తి

కెప్టెన్సీ సమర్థత అతడికి లేదని అభిప్రాయపడిన అజిత్ అగార్కర్




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా సారథి రోహిత్‌శర్మ టీ20ల నుంచి తప్పుకోవడంతో ఆ పగ్గాలు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు అప్పజెబుతారని, జట్టులో అంతకుమించిన సమర్థుడు లేడని అభిమానులు అనుకున్నారు. అయితే, వారి అంచనాలను కోచ్ గౌతం గంభీర్ తలకిందులు చేశాడు. శ్రీలంక పర్యటనకు భారత జట్టును ఎంపిక చేసిన అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ అనూహ్యంగా సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్‌గా, శుభమన్‌గిల్‌ను వైస్ కెప్టెన్‌గా ప్రకటించింది. ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడంలో తరచూ విఫలమవుతున్న హార్దిక్ పాండ్యా విషయంలో గంభీర్ కన్విన్స్ కాలేకపోయాడని నివేదికలు చెబుతున్నాయి. అందుకనే అతడిని పక్కనపెట్టి సూర్యకుమార్ యాదవ్‌ను కోరుకున్నట్టు తెలిసింది. అంతేకాదు, ఈ విషయంలో అజిత్ అగార్కర్ పాత్ర కూడా ఉన్నట్టు సమాచారం. కోచ్‌గా గంభీర్ రాకతో పాండ్యా కెప్టెన్సీ అవకాశాలు దారుణంగా దెబ్బతిన్నాయి. రోహిత్ తర్వాత జట్టులో కెప్టెన్సీ చేపట్టే సామర్థ్యం అతడికే ఉందని అభిమానులు భావించారు. అయితే, అతడికి సారథిగా ఉండేందుకు అవసరమైన సమర్థత ఉందని అజిత్ అగార్క్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ విశ్వసించలేకపోయిందని తెలిసింది.

## నలుపు రంగులో ఈషా రెబ్బా ఆకర్షణీయ మైన క్లిక్‌లు



# ఫాంటసీ వెబ్ సిరీస్‌లో.. సమంత





**హైదరాబాద్ పెన్ పవర్:** వరుస ప్రాజెక్ట్స్‌తో తిరిగి ఫుల్ బిజీ అవబోతోంది సమంత. అనారోగ్య కారణాలతో కెరీర్‌లో చిన్న గ్యాప్ తీసుకుని, షూటింగ్స్‌కు దూరంగా ఉంటున్న ఆమె.. వచ్చే నెల నుంచి సెట్స్‌లో అడుగుపెట్టబోతున్నట్టు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. అయితే అది ఏ ప్రాజెక్ట్ అనేది మాత్రం ఆమె రివీల్ చేయలేదు. ఇదిలా ఉంటే.. తాజాగా ఆమె ఓ వెబ్ సిరీస్‌కు ఓకే చెప్పినట్టు సమాచారం.

తుంబాడ్' అనే హారర్ థ్రిల్లర్‌తో మెప్పించిన రాహి అనిల్ బార్వే దీనికి దర్శకుడు. సమంత నటించిన ఫ్యామిలీ మ్యాన్ 2, సిటాడెల్ వెబ్ సిరీస్‌లు తీసిన రాజ్ అండ్ డీకే దీనికి షో రన్నర్స్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సిరీస్‌కు 'రక్త బ్రహ్మాండ్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేసినట్టు తెలుస్తోంది. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఫాంటసీ డ్రామా ఇది. ప్రేమ, త్యాగం, మోసం, ద్రోహం, దోపిడీ లాంటి డిఫరెంట్ ఎలిమెంట్స్ ఇందులో ఉండనున్నాయట.

సమంతతో పాటు ఆదిత్య రాయ్ కపూర్, వామికా గబ్బీ నటించనున్నారు. నిజానికి మొదట దీన్ని సినిమాగా తీయాలనుకున్నారు. కానీ పెద్ద కథ కావడంతో ఒకే భాగంలో పూర్తి కథ చెప్పలేమని వెబ్ సిరీస్‌గా మార్చారని టాక్. నెట్ ఫ్లిక్స్ కోసం హై టెక్నికల్ వ్యాల్యూస్, వీఎఫ్ఎక్స్ వర్క్‌తో దీన్ని ప్లాన్ చేస్తున్నారు. ఇక సమంత నటించిన 'సిటాడెల్' వెబ్ సిరీస్ త్వరలో స్ట్రీమింగ్ కానుంది.

## మర్నా యొక్క ఆకర్షణీయ మైన పోజులు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com